క్లుప్తంగా

నేటి నుంచి ఈఏపీసెట్ తరగతులు

భైంసా: కళాశాలలో శుక్రవారం నుంచి నిర్వహించే ఈఏపీసెట్ తరగతులను ఇంటర్ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని లోకేశ్వరం జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గౌతం అన్నారు. ఇంటర్ బోర్డు కార్యదర్శి ఆదేశాల మేరకు ప్రథమ, ద్వితీయ సంవత్సరంలోని సైన్స్ విద్యార్థుల కోసం కళాశాలలో నిత్యం ఈ ప్రత్యేక తరగతులు నిర్వహిస్తామన్నారు. విద్యార్థులు తరగతులకు హాజరై ఈఏపీసెట్ రాయాలన్నారు. ఇందులో 80వేల కుపైగా ర్యాంకు వచ్చినా ప్రభుత్వం ఫీజు లో రాయితీ ఇస్తుందని తెలిపారు.

నూతన కార్యవర్గం


ఎన్నికైన కమిటీ సభ్యులు

కడెం: మండల కేంద్రంలో గురువారం ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ నియోజకవర్గ అధ్యక్షుడు ఆర్ల రమేశ్ ఆధ్వర్యంలో కడెం మండల కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ మండల కన్వీనర్‌గా రత్నాల పోషన్న, కో–కన్వీనర్‌గా రాజశేఖర్, దుర్గం రాజేందర్, కోశాధికారిగా దుర్గం గంగాధర్, సభ్యులుగా రాజమౌళి, గంగన్న, భూమన్న, లక్ష్మణ్ తదితరులు ఎన్నికయ్యారు.

సీజ్ చేసిన ఇసుకకు వేలం

భైంసాటౌన్: పట్టణంలోని సిటీ కాంటా, జియో పెట్రోల్‌పంప్, పాత ఆర్టీవో చెక్‌పోస్ట్ వద్ద ఇటీవల పోలీసులు ఇసుక డంప్‌లు స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. స్వాధీనం చేసుకున్న ఇసుకకు గురువారం రెవెన్యూ అధికారులు వేలం నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయంలో వేలం నిర్వహించగా 930 క్యూబిక్ మీటర్ల ఇసుకను రూ.5.97 లక్షలకు విక్రయించినట్లు డీటీ అశోక్ తెలిపారు.

ఆలయ వార్షికోత్సవం

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ఆర్యవైశ్య సంఘంలో ఉన్న శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయ వార్షికోత్సవం గురువారం వైభవంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి కుంకుమార్చన, అభిషేకం, హారతి, హోమం పూజాది కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం బస్టాండ్ వద్ద అన్నదానం ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు విజయదర్శన్, దేవరకోట మాజీ చైర్మన్ ఆమెడ శ్రీధర్, శ్రీనివాస్, భక్తులు పాల్గొన్నారు.

నిలిచిన వేలం ప్రక్రియ

సారంగపూర్: మండలంలోని శ్రీఅడెల్లి మహాపోచమ్మ ఆలయ ప్రాంగణంలో శుక్రవారం పలు దుకాణ సముదాయాల నిర్వహణకు ఏర్పాటు చేసిన వేలంలో పాల్గొనేందుకు వ్యాపారులెవరూ ముందుకురాలేదు. త్వరలో మళ్లీ వేలంపాట నిర్వహించే తేదీని పత్రికా పరంగా తెలియజేస్తామని ఆలయ ఈఓ రమేశ్ తెలిపారు.

గోవధశాలకు అనుమతులు ఇవ్వొద్దు


వినతిపత్రం ఇస్తున్న నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: తమ గ్రామ శివారులో గోవధశాలకు అనుమతి ఇవ్వవద్దని సారంగపూర్ మండలం చించోలి(బి) వీ డీసీ ఆధ్వర్యంలో రాజకీయ పార్టీల నాయకులు గురువారం అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్‌తోపాటు ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రాలు అందజేశారు. ఈసందర్భంగా అఖిలపక్ష నాయకులు మాట్లాడుతూ గోవధశాల అనుమతులు నిలిపివేసే వరకు పోరాటం చేస్తామన్నారు. అవసరమైతే మండలంలోని అన్ని గ్రామాల ప్రజలతో ధర్నా చేస్తామని హెచ్చరించారు.

గ్రామాల్లో వర్షం

ఖానాపూర్: పట్టణంలో గురువారం ఒక్కసారిగా కురిసిన వర్షానికి పలు రోడ్లు జలమయమయ్యాయి. మున్సిపాలిటీ అయినప్పటికీ ఖానాపూర్‌లో సరైన డ్రెయినేజీ వ్యవస్థ లేక చిన్నపాటి వర్షానికే రోడ్లపై వరద నిలుస్తోంది. వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు.

కుంటాల: మండలంలోని కల్లూర్, అందాకూర్, అంబకంటి, కుంటాల, ఓలా, లింబా(కె), లింబా(బి) తదితర గ్రామాల్లో గురువారం సాయంత్రం వర్షం కురిసింది. ఉక్కపోతతో సతమతమవుతున్న ప్రజలకు వర్షంతో ఉపశమనం లభించింది.

పంటలను ధ్వంసం చేసిన అడవిపందులు

ఖానాపూర్: మండలంలోని బావాపూర్(ఆర్) తండాలో బుధవారం రాత్రి అడవి పందులు దాడి చేయడంతో మొక్కజొన్న పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. గ్రామంలోని చౌహాన్ రామారావు, లావుడ్యా జవహర్‌లాల్‌కు చెందిన చేన్లలోకి పందులు చొరబడి ధ్వంసం చేశాయి. ప్రభుత్వం తమకు నష్టపరిహారం అందించాలని రైతులు కోరారు.

డేంజర్ డాగ్స్..

- మూగజీవాలను కరుస్తున్న కుక్కలు
- మృత్యువాత పడుతున్న పశువులు, గొర్రెలు
- నష్టపోతున్న పాడిరైతులు
- పట్టించుకోని అధికారులు


ఈ చిత్రంలో కనిపిస్తున్న రైతు లక్ష్మణచాంద మండలం మల్లాపూర్ గ్రామానికి చెందిన గొర్రె ఆశన్న. తనకున్న మూడు పాడి పశువుల్లో వారం కిందట ఒక గేదె దూడకు జన్మనిచ్చింది. నాలుగు రోజులుగా మేత తినకుంటే అనుమానం వచ్చిన రైతు పశువైద్యులను సంప్రదించారు. పిచ్చికుక్క కరవడంతో గేదెకు రేబిస్ వ్యాధి సోకిందని పశువైద్యాధికారి నిర్ధారించారు. సుమారు రూ. నాలుగు వేలు ఖర్చు చేసి వైద్యం అందించినా గేదె బుధవారం ఉదయం మృతి చెందింది. దీని విలువ రూ.50 వేల వరకు ఉంటుందని.. ప్రభుత్వం ఆదుకోవాలని పాడి రైతు వేడుకుంటున్నాడు.


సోన్ మండలం కద్తాల్‌లో కుక్కల దాడిలో మృతి చెందిన గొర్రెలు

లక్ష్మణచాంద: గ్రామాల్లో కుక్కలు బెంబేలెత్తిస్తున్నాయి. పగలు రాత్రి అనే తేడా లేకుండా రోడ్లపై పశువులు, గొర్రెలు, మేకలు ఒంటరిగా కన్పిస్తే గుంపులుగా వచ్చి దాడులు చేస్తున్నాయి. కేవలం రెండు వారాల వ్యవధిలో నాలుగు గేదెలు, గొర్రెలు, మేక కుక్కల దాడికి బలైనట్లు మండంలోని ఆయా గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు. పిచ్చికుక్కలు దాడులు చేస్తున్నా.. రైతులు సకాలంలో గుర్తించి వైద్యం అందించకపోవడంతో మూగజీవాలు మృత్యు ఒడిలోకి చేరుతున్నాయి. అధికారులు, పాలకులు, స్పందించి వీధికుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

గ్రామాల్లో జరిగిన ఘటనలివీ..

- వారం కిందట లక్ష్మణచాంద మండలం పీచర గ్రామంలో ఉడుత సుమన్ అనే రైతు గేదెను కుక్క కరిచింది. సకాలంలో రైతు గుర్తించకపోవడంతో వైద్యం అందక గేదె మృతి చెందింది.
- లక్ష్మణచాంద మండలం మల్లాపూర్‌లో ద్యావత్ రాజన్నకు చెందిన గేదెను పిచ్చికుక్క కరవడంతో ఈనెల 25న ఆదివారం మృతి చెందింది.
- లక్ష్మణచాంద మండలం మల్లాపూర్‌లో ఈనెల 26న సోమవారం ద్యావత్ పోషన్న గేదె పిచ్చికుక్క కరవడంతోనే మృతి చెందింది.
- లక్ష్మణచాంద మండలం మల్లాపూర్‌లో గొర్రె ఆశన్న అనే రైతు గేదెను పిచ్చి కుక్క కరవడంతో చికిత్స పొందుతూ ఈనెల 28న బుధవారం ఉదయం మృతి చెందింది.
- ఖానాపూర్ మండలం గోసంపల్లెలో గుగ్లావత్ కిషన్ మేకల మందపై ఈనెల 27న రాత్రి కుక్కలగుంపు దాడి చేయడంతో ఒక మేక మృతి చెందిగా మరో 10 మేకలకు గాయాలయ్యాయి.


లక్ష్మణచాంద: కన్కాపూర్‌లో కుక్కల గుంపు

రేబిస్ లక్షణాలవే..

- రేబిస్ సోకిన మూగజీవాలు బెదురు ముఖంతో చూస్తాయి.
- నోటి నుంచి నురగతో కూడిన సొల్లు కిందకు కారుతుంది.
- జీవాల డొక్కలు లోపలికి పోవడం.
- కొమ్ములు, తలతో చెట్లను, గోడలను, కట్టేసిన కర్రను కొట్టుకోవడం.

- రెండు నెలల కిందట సోన్ మండలం కద్తాల్ గ్రామానికి చెందిన అరికెల వెంకటేశ్ గొర్రెల మందపై కుక్కలు దాడి చేయడంతో 10 వరకు మృతి చెందాయి.

సకాలంలో గుర్తించకుంటే ముప్పే..

గ్రామాల్లో పాడి రైతులు తమ పశువులను రాత్రి ఇంటి ముందు కట్టేస్తున్నారు. దీంతో గ్రామంలోని వీధికుక్కలు గుంపులుగా తిరుగుతూ రాత్రివేళ మూగజీవాల మందపై దాడులకు దిగుతున్నాయి. గొర్రెలు, మేకలను చంపేస్తూ.. గేదెలను గాయపరుస్తున్నాయి. కుక్క కాటుకు గురైన గేదెలను గుర్తించడంలో ఆలస్యం కావడంతో రేబిస్ వ్యాధి బారిన పడుతున్నట్లు పశువైద్యాధికారులు పేర్కొంటున్నారు. వారు వచ్చి వైద్యం అందిస్తున్నా.. వ్యాధి తీవ్రత పెరిగి పశువులు మృత్యువాత పడుతున్నాయి.


మల్లాపూర్‌లో మృతి చెందిన గేదె

సకాలంలో గుర్తిస్తేనే చికిత్స


పశువులను పిచ్చికుక్కలు కరిచినప్పుడు సకాలంలో గుర్తిస్తేనే వాటికి చికిత్స అందించి రక్షించే వీలుంటుంది. కుక్కకాటుకు గురైన 24 గంటల్లోపు మొదటి డోసు యాంటీ రేబిస్ వ్యాక్సిన్ ఇవ్వాలి. రేబిస్ వచ్చిన జీవాలకు కనీసం 5 డోసుల యాంటీ రేబిస్ వ్యాక్సిన్ వేయించాలి. కుక్క కరిచిన రోజు మొదటి డోసు, మూడో రోజు రెండో డోసు, ఏడో రోజు మూడోడోసు, 14వ రోజు నాలుగో డోసు, 28వ రోజు ఐదో డోసు వేయించాలి. సకాలంలో వ్యాక్సిన్ వేయిస్తే జీవాలను రేబిస్ నుంచి కాపాడవచ్చు.
– శ్రీనివాస్, ఇన్‌చార్జి మండల పశువైద్యాధికారి

నష్టపోతున్న రైతులు..

తమకు జీవనోపాధి కల్పించే పశువులు వీధికుక్కల కాటుకు పాడి పశువులు మృతి చెందుతుండటంతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. పాలకులు, అధికారులు స్పందించి పరిహారం అందించి ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

పాఠశాలల్లో జాతీయ క్రీడాదినోత్సవం

కుంటాల: మండలంలోని ఆయా గ్రామాల్లోని పాఠశాలల్లో గురువారం జాతీయ క్రీడా దినోత్సవం నిర్వహించారు. ధ్యాన్‌చంద్ చిత్రపటానికి నివాళులర్పించారు. విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఎంఈవో ముత్యం, ప్రిన్సిపాల్ సంతోష్, డైరెక్టర్ ప్రవీణ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దిలావర్‌పూర్: మండల కేంద్రంతోపాటు సిర్గాపూర్, న్యూలోలం తదితర గ్రామాల్లో క్రీడా దినోత్సవం నిర్వహించారు. దిలావర్‌పూర్ ఉన్నత పాఠశాలలో ఎస్సై రాజేశ్వర్‌గౌడ్, ఎంపీవో గోవర్ధన్ క్రీడాజ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సిర్గాపూర్ ప్లేర్ ఉన్నత పాఠశాలలో కరస్పాండెంట్ నరసింహారెడ్డి ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. దిలావర్‌పూర్ పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


కుంటాలలో కబడ్డీ ఆడుతున్న విద్యార్థులు

లక్ష్మణచాంద: మండలంలోని మల్లాపూర్ ప్రభుత్వ పాఠశాలలో ధ్యాన్‌చంద్ చిత్రపటానికి నివాళులర్పించారు. విద్యార్థులకు ఆటలపోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. పీఈటీలు విలాస్, దత్తాద్రి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


తానూరు: భోసి పాఠశాలలో..

తానూరు: మండలంలోని భోసి శిశుమందిర్ పాఠశాలలో విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. ప్రధానోపాధ్యాయుడు దత్తాత్రి, పాఠశాల సమితి అధ్యక్షుడు చాదల భోజన్న, కార్యదర్శి కిష్టయ్య, రాంనాథ్, పూర్వ విద్యార్థులు రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్యపరీక్షలు

మామడ: మండల కేంద్రంలోని ఎస్సీ సంక్షేమ వసతిగృహంలో గురువారం వైద్యసిబ్బంది వైద్యశిబిరం నిర్వహించారు. విద్యార్థులు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి శ్రీకాంత్ సూచించారు. 68 మంది విద్యార్థులను పరీక్షించి అవసరమైన వారికి రక్త పరీక్షలు, మందులు అందించారు. శిబిరాన్ని ఎంపీడీఓ గంగాసాగర్‌రెడ్డి పరిశీలించారు. కార్యక్రమంలో సంక్షేమాధికారి సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

దిలావర్‌పూర్ కేజీబీవీలో..

దిలావర్‌పూర్: మండల కేంద్రంలోని కేజీబీవీలో గురువారం విద్యార్థినులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఇటీవల పలువురు విద్యార్థులు చర్మ సంబంధిత సమస్యలు, జ్వరాలతో బాధపడుతున్నందున దిలావర్‌పూర్ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా పలువురికి మందులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అరుణారాణి, ఎంపీఓ గోవర్ధన్, ఆసుపత్రి సీహెచ్‌ఓ రాజేశ్వర్, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, ఎస్‌ఓ అపర్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులను తీర్చిదిద్దేది ఉపాధ్యాయులే

కుంటాల: విద్యార్థులను మేధావులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులదేనని డీఈవో రవీందర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని లింబా(కే) ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు మిట్టపల్లి నర్సయ్య ఉద్యోగ విరమణ సందర్భంగా గురువారం పాఠశాలలో సన్మానించారు. సవ్వి అశోక్‌రెడ్డి, ఆనంద్‌రావు పటేల్, ఎంపీటీసీ గిరీష్, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు నరేంద్రబాబు, ప్రధాన కార్యదర్శి బీవీ రమణారావు, మండల బాధ్యులు సతీష్, ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ప్రసాద్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు గజేందర్ తదితరులు పాల్గొన్నారు.

సాఠే జయంతి

తానూరు: అన్నాభావు సాఠే అడుగుజాడల్లో నడవాలని ఎస్సై సందీప్ అన్నారు. గురువారం మండలంలోని దాగాం గ్రామంలో సాఠే జయంతి నిర్వహించారు. అంబేద్కర్, సాఠే విగ్రహాలకు నివాళులర్పించారు. జెండాను ఆవిష్కరించారు. సాయినాథ్, శంకర్, సాఠే యూత్ యువకులు తదితరులు పాల్గొన్నారు.

భైంసారూరల్: మండలంలోని టాక్లీ గ్రామంలో అన్నాభావు సాఠే జయంతి నిర్వహించారు. సంజీవ్‌రావుపటేల్, పరమేశ్వర్, నాగోరావుపటేల్, సాయినాథ్, గంగాధర్, మల్లేశ్ ఉన్నారు.

తెలుగు భాషా దినోత్సవం


లోకేశ్వరంలో సన్మానిస్తున్న కళాశాల సిబ్బంది

భైంసా: లోకేశ్వరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం తెలుగుభాషా దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా తెలుగు అధ్యాపకులు విఠల్‌ను సన్మానించారు. ప్రిన్సిపాల్ కె.గౌతమ్ తెలుగు భాష గొప్పతనం వివరించారు. ప్రాథమిక విద్యాభ్యాసాన్ని మాతృభాషలోనే కొనసాగించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు వినోద్, ప్రమీలరాణి, శ్రీనివాస్, నవీన్, చిన్నయ్య, మహేందర్, సాయినాథ్, హరీశ్ పాల్గొన్నారు.

సోన్: గిడుగు వెంకటరామ్మూర్తి జయంతి పురస్కరించుకొని మండలంలోని కద్తాల్ ప్రాథమిక పాఠశాలలో గురువారం తెలుగు భాషా దినోత్సవం నిర్వహించినట్లు ప్రధానోపాధ్యాయుడు ప్రభాకర్ తెలిపారు. అ నుంచి ఱ వరకు తెలుగు అక్షరాలను మాస్క్ రూపంలో తయారు చేసి విద్యార్థులు ప్రదర్శించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడు రమేశ్‌బాబు, మంగమ్మ, రాధ, జ్యోతి తదితరులున్నారు.

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ఆదర్శనగర్ అల్ఫోర్స్ పాఠశాలలో క్రీడా దినోత్సవం, తెలుగు భాషా దినోత్సవం నిర్వహించారు. ధ్యాన్‌చంద్, గిడుగు రామ్మూర్తి చిత్రపటాలకు నివాళులర్పించారు. విద్యార్థులకు ఆటలపోటీలు నిర్వహించారు. ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


సోన్: కద్తాల్ ప్రాథమిక పాఠశాలలో తెలుగు అక్షర మాల ప్రదర్శిస్తున్న విద్యార్థులు


నిర్మల్‌లోని అల్ఫోర్స్ పాఠశాలలో..

కుంటాల: మండలంలోని గ్రామాల పాఠశాలల్లో తెలుగు భాషా దినోత్సవం నిర్వహించారు. ఎంఈవో ముత్యం, ప్రిన్సిపాళ్లు శ్రీనివాస్ ప్రసాద్, సంతోష్, డైరెక్టర్ ప్రవీణ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాసర: మండల కేంద్రంలోని శ్రీనాగభూషణ విద్యాలయంలో క్రీడా దినోత్సవం, తెలుగు భాషా దినోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపాల్ బాబురావు ఆటలతో కలిగే ప్రయోజనాలను వివరించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ వైద్యాధికారిపై ఫిర్యాదు

ఖానాపూర్: ఖానాపూర్, పెంబి మండలాల పరిధిలోని పెంబి పీహెచ్‌సీ వైద్యాధికారి నిధుల దుర్వినియోగంతో పాటు విధులు సక్రమంగా నిర్వహించడం లేదని బీఎస్పీ నియోజకవర్గ కన్వీనర్ కుక్కారికారి రాజేశ్, ప్రధాన కార్యదర్శి శివ గురువారం నిర్మల్‌లో కలెక్టర్ అభిలాష అభినవ్‌తోపాటు డీఎంహెచ్‌వోకు ఫిర్యాదు చేశారు. పీహెచ్‌సీ పరిధిలోని ఉపకేంద్రాల నిర్వహణకు యునైటెడ్, శానిటేషన్ నిధులను ఇవ్వలేదని ఆరోపించారు. ఖానాపూర్, పెంబి, దస్తురాబాద్ పీహెచ్‌సీలకు ఇన్‌చార్జి వైద్యాధికారిగా ఉన్నప్పటికీ విధులకు హాజరవకుండా పట్టణంలో ప్రైవేట్ ఆస్పత్రిని ఏర్పాటు చేసుకున్నారని అన్నారు. ఓ వైపు జ్వరాలతో ప్రజలు ఇబ్బంది పడుతుంటే అత్యవసర మందులు పీహెచ్‌సీ రికార్డుల్లో తప్ప ఆస్పత్రిలో అందుబాటులో ఉంచడం లేదన్నారు. దీంతో క్షేత్రస్థాయి సిబ్బంది ఇబ్బందులకు గురవుతున్నారని.. సమగ్ర విచారణ చేయాలని కోరుతూ ఫిర్యాదు చేసినట్లు వారు పేర్కొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే ఊరుకోం


చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే రామారావు పటేల్

కుంటాల: అధికారులు విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే ఊరుకునేది లేదని ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ హెచ్చరించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులకు ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. అధికారులు పారదర్శకంగా పని చేస్తే కుటుంబసభ్యుల్లా చూసుకుంటానని పేర్కొన్నారు. గ్రామాల్లో విద్య,వైద్యం మౌలిక వసతుల కల్పనకు కలసికట్టుగా కృషి చేయాలని ఆదేశించారు. అంతకుముందు కుంటాల రైతువేదికలో 54 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అప్పగజ్జారాం యాదవ్, అరుణ రమణారావు, పి.వెంగల్‌రావు, పసుల నవీన్, జక్కుల గజేందర్, తాటి శివ, అధికారులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి

కడెం: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పీఆర్టీయూ కృషి చేస్తుందని ఆ యూనియన్ జిల్లా అధ్యక్షుడు నరేంద్రబాబు, కార్యదర్శి రమణారావు అన్నారు. గురువారం కడెం, లింగాపూర్ జెడ్పీ పాఠశాలలో పీఆర్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ నాలుగు డీఏల మంజూరు, పీఆర్సీ అమలు, సీపీఎస్ రద్దుకు పీఆర్టీయూ పోరాడుతుందని పేర్కొన్నారు. మండలాధ్యక్షుడు బొమ్మిడి మహేశ్వర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కిషన్, హెచ్‌ఎం వెంకటరమణ, వెంకటరాములు, రాఘవేందర్, శ్రీనివాస్, ఫణీంద్ర తదితరులున్నారు.

షరతుల్లేకుండా రుణమాఫీ చేయాలి


ఖానాపూర్‌లో వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఖానాపూర్: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రూ.2లక్షల రుణం మాఫీ చేయడంతోపాటు ఎన్నికల వేళ ఇచ్చిన హామీలను అమలు చేయాలని అఖిల భారత ప్రగతిశీల రైతుసంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి నంది రామయ్య అన్నారు. గురువారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి వినతిపత్రం అందజేశారు. ధరణి సమస్యలు పరిష్కరించి పోడుభూములకు పట్టాలు ఇవ్వాలని కోరారు. రైతు భరోసా ఇవ్వకపోవడంతో అన్నదాతలు పెట్టుబడుల కోసం వడ్డీవ్యాపారులను ఆశ్రయించి నష్టపోతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో అంకుష్‌రావు, జక్కుల రాజన్న, కుంచపు ఎల్లయ్య, గోరెబాయ్, సుదర్శన్, మచ్చ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

నిర్మల్‌చైన్‌గేట్: షరతుల్లేకుండా రైతులకు రూ.రెండు లక్షల్లోపు రుణం మాఫీ చేసి.. రైతు భరోసా పథకం ద్వారా పెట్టుబడిసాయం అందించాలని కోరుతూ గురువారం కలెక్టరేట్‌లో సీపీఐ(ఎం) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో డీఆర్వోకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దుర్గం నూతన్‌కుమార్, బొమ్మెన సురేశ్, జిల్లా కమిటీ సభ్యులు ఇప్ప లక్ష్మణ్, సీపీఎం పట్టణ కార్యదర్శి ఫసీయుద్దీన్, పోశెట్టి, చందుల సాయికిరణ్ పాల్గొన్నారు.

మానవత్వం చాటిన వైద్యుడు

- నిరుపేదకు ఉచితంగా శస్త్రచికిత్స చేసిన జిల్లా ఆసుపత్రి మాజీ సూపరింటెండెంట్



చికిత్స అనంతరం కోలుకున్న శంకర్‌తో వైద్యులు దేవేందర్‌రెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్: ఓ నిరుపేదకు ఖరీదైన వైద్యం అందించి పట్టణానికి చెందిన జిల్లా జనరల్ ఆసుపత్రి మాజీ సూపరింటెండెంట్ డాక్టర్ దేవేందర్‌రెడ్డి మానవత్వం చాటారు. నిర్మల్‌కు చెందిన చొక్కాల శంకర్ ఓ ఆలయంలో పూజారి. నెలరోజుల కిందట ఇంట్లో స్నానాల గదిలో పడిపోవడంతో కాలికి తీవ్ర గాయమైంది. అది పెద్దదై ప్రాణాల మీదకే వచ్చింది. ఏ ఆధారం లేని తమ ఇంటిపెద్దను కాపాడుకునేందుకు కుటుంబసభ్యులు అన్ని ప్రయత్నాలు చేసి దేవుడిపైనే భారం వేశారు. ఈ విషయం తెలుసుకున్న డాక్టర్ దేవేందర్‌రెడ్డి తన ఆసుపత్రిలో చికిత్స అందించేందుకు ముందుకొచ్చారు. కుడికాలు పూర్తిగా ఇన్ఫెక్షన్‌కు గురవడంతో తొడ పైభాగం వరకు తొలగించి 15 రోజుల పాటు ఐసీయూలో ఉంచి మెరుగైన వైద్యం అందించారు. దీంతో శంకర్ కోలుకోవడంతో గురువారం ఆయనను డిశ్చార్జి చేశారు. ఇదే వైద్యం హైదరాబాద్ వంటి నగరాల్లో చేయిస్తే రూ.15 లక్షలకు మించి ఖర్చయ్యేదని డాక్టర్లు పేర్కొన్నారు. తాము దేవేందర్‌రెడ్డికి, వైద్యులు అరుణరెడ్డి, అశ్విన్ రెడ్డి, శ్రీనివాసయాదవ్, థియేటర్ సిబ్బంది, నర్సింగ్ స్టాఫ్‌కు రుణపడి ఉంటామని శంకర్ కుటుంబసభ్యులు తెలిపారు.

ఆసుపత్రుల్లో సేవల ఫీజు ప్రదర్శించాలి


రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో రాజేందర్

నిర్మల్‌చైన్‌గేట్: ప్రైవేటు ఆసుపత్రుల్లో అందించే సేవల ఫీజు తెలిపే చార్టును విధిగా ప్రదర్శించాలని డీఎంహెచ్‌వో రాజేందర్ యాజమాన్యాలను ఆదేశించారు. గురువారం జిల్లా కేంద్రంలోని వందన, వేంకటేశ్వర, కల్పన ప్రైవేట్ ఆసుపత్రులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ -2010 ప్రకారం ప్రైవేట్ హాస్పిటల్ నిర్వహించాలన్నారు. రోగులకు కనీస అవసరాలను తప్పనిసరిగా కల్పించాలన్నారు. జ్వరాలన్నీ డెంగీ కావని.. వైరల్ జ్వరాలు అధికంగా వస్తున్నాయని తెలిపారు. ఎలిసా పరీక్ష ద్వారా డెంగీ నిర్ధారణ చేయాలని సూచించారు. అధిక చార్జీలు వసూలు చేసే ఆసుపత్రులపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్యక్రమ నిర్వహణ అధికారులు డాక్టర్ రవీందర్‌రెడ్డి, ఎంహెచ్‌ఎన్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ సౌమ్య, డిప్యూటీ జిల్లా విస్తరణ, మీడియా అధికారి రవీందర్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ఓటరు జాబితా పరిశీలన

ఖానాపూర్: ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలోని గోసంపల్లె, పాతఎల్లాపూర్, బావాపూర్(కె) గ్రామాల్లో గురువారం ఎంపీవో రత్నాకర్ రావు పర్యటించారు. పలు వార్డుల్లోని ఓటరు జాబితా పారిశుద్ధ్య పనులు పరిశీలించారు.

నేడు సమావేశం

ముధోల్: బీజేపీ జిల్లాశాఖ ఆదేశాల మేరకు శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పార్టీ సభ్యత్వ మండల స్థాయి సమావేశాన్ని నిర్వహించనున్నట్లు గురువారం ఆ పార్టీ మండలాధ్యక్షుడు కోరి పోతన్న ఒక ప్రకటనలో తెలిపారు. నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని కోరారు.

పనులు పకడ్బందీగా నిర్వహించాలి

లక్ష్మణచాంద: పారిశుద్ధ్య పనులు పకడ్బందీగా చేపట్టాలని ఎంపీడీవో రాధ సిబ్బందిని ఆదేశించారు. గురువారం మండలంలోని రాచాపూర్ ఎస్సీ కాలనీలో పారిశుద్ధ్య పనులను ఎంపీడీవో పరిశీలించి మాట్లాడారు. దోమల నివారణకు ఆయిల్‌బాల్స్ వేయించాలన్నారు. వైద్య సిబ్బందితో ఫోన్‌లో మాట్లాడి గ్రామంలో వైద్యశిబిరం ఏర్పాటు చేయించారు. వార్డుల వారీగా ఓటర్ల వివరాలను క్రమబద్ధీకరించాలని కార్యదర్శులకు సూచించారు.

రుణమాఫీకి దరఖాస్తుల స్వీకరణ

నర్సాపూర్(జి): మండల కేంద్రంలోని రైతువేదికలో రేషన్ కార్డు లేని రైతుల నుంచి ఏఓ రాంచందర్ నాయక్ రుణమాఫీ దరఖాస్తులను స్వీకరించారు. గురువారం 40 దరఖాస్తుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశామన్నారు. రుణం మాఫీ కాకుంటే కుటుంబసభ్యుల ఆధార్, పట్టాదారు, బ్యాంకు పాసుపుస్తకాల జిరాక్స్‌లు, రుణమాఫీ ఫిర్యాదు ఫారం, ఏఈఓలకు అందజేయాలని సూచించారు.

ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవాలు

ఖానాపూర్: మండలంలోని సుర్జాపూర్ గ్రామంలో ఉన్న శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవాలు ప్రారంభమయ్యాయి. యజ్ఞాచార్యులు నర్సింహమూర్తి, ప్రధాన అర్చకులు అనీష్, అర్చకులు నితీష్ ఆచార్య, సంతోష్ ఆధ్వర్యంలో స్థాపిత దేవతార్చనలు, తదితర పూజాది కార్యక్రమాలు నిర్వహించారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నిర్మల్
99516 02888
99122 20764
Office mail : nzbadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
నిర్మల్ మరియు ముధోల్ :
జి.గంగాధర్ - 7997958182
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899